INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:2(5), February 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

# అన్నమయ్య సంకీర్తనల్లో స్త్రీల అలంకరణ విశేషాలు

**డా॥ గుమ్మనూరు ఉషారాణి**
తెలుగు శాఖాధ్యక్షులు,
శ్రీమతి ఎన్.పి. సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల,
చిత్తూరు – 517 002. (ఆం.ప్ర).
సెల్ : 91824 07127.

**పరిచయం :**

మానవులు అలంకరణప్రియులు. అందం జన్మతః సిద్ధించేది. అయితే అనాకారులు సైతం అందంగా కనబడాలని కోరుకోవడం తప్పేమీకాదు. అలాంటివారు తాము అందంగా కల్పించాలని రకరకాల అలంకరణలు చేసుకొంటారు. అందంగా ఉండే స్త్రీలు కూడా తమ అందాన్ని ఇనుమడింపజేసుకోవడానికి ప్రయత్నిస్తారు. స్త్రీల అలంకరణలను, వాళ్ళు ధరించే వస్త్రాభరణాలను పరిశీలిస్తే అవి సాంఘికంగా, సాంస్కృతికంగా కొంత ప్రాధాన్యత కలిగివున్నట్లు తెలుస్తోంది. ఒక కాలంనాటి సంఘసంస్కృతిని ఆనాటి వేషభూషణాల ఆధారంగా నిర్ణయించవచ్చు. ధనవంతులు, పేదలు వారివారి శక్త్యానుసారం వస్త్రాల్ని, ఆభరణాల్ని ధరిస్తారు. సందర్భాన్నిబట్టి కూడా వీటిలో తేడా కనిపిస్తోంది. కొన్ని కులాచారాల ప్రకారం పైట వేసుకొనే పద్ధతుల్లో కూడా తేడాలుంటాయి. వయస్సుల్ని బట్టికూడా ఈ అలంకరణల్లో తేడా ఉండొచ్చు.

**కీలక పదాలు :**

అన్నమయ్య సంకీర్తనలు – అలంకరణ – మజ్జనం – చీరలు – మైపూతలు – అన్నమయ్య కాలం నాటి సాంఘిక, సామాజిక అంశాల పరిశీలన.

**ఉపోద్ఘాతం :**

అన్నమయ్య రచించిన వేల శృంగారసంకీర్తనల్లో వివిధ వర్ణాల, జాతుల స్త్రీలు ధరించిన వస్త్రాలు, ఆభరణాలు ఆనాటి సాంఘిక, సాంస్కృతిక పరిస్థితుల్ని ప్రతిబింబిస్తున్నాయి.

అన్నమయ్య సంకీర్తనల్లోని స్త్రీల వేషభూషణాల్ని – మజ్జనం, చీరలు, మైపూతలు, బొట్లు, కాటుక, శిరోజాలంకరణ అనే అంశాలుగా వర్గీకరించి పరిశీలించడమైంది.

**1. మజ్జనం :**

శరీర శుభ్రతకోసం చేసేది స్నానం. పూర్వం సామాన్య స్త్రీలు, కూలినాలి చేసుకొని బ్రతికే స్త్రీలు వారానికొక్కసారే స్నానం చేసేవారని, మధ్యతరగతి స్త్రీలైతే పసుపు, సున్నిపిండితో స్నానం చేసేవారని తెలుస్తోంది. ఇక ధనికస్త్రీలు అంతఃపుర స్త్రీల స్నానాల విషయానికొస్తే వారి దైనందిన జీవితంలో భోజనంలాగే అది కూడా అత్యంత ముఖ్యమైన ఘట్టమే. దీనికి చక్కని ఉదాహరణ హంపీలో సజీవంగా దర్శనమిచ్చే రాణుల స్నానశాల (Great Bath) అన్నమయ్య సంకీర్తనల్లో ధనికుల ఇళ్ళల్లోని స్నానాల ఘట్టం మాత్రమే వర్ణించబడింది.

International Journal of Multidisciplinary Educational Research
ISSN:2277-7881(Print); Impact Factor :10.16(2026); IC Value:5.16; ISI Value:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:2(5), February 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

క్రింది సంకీర్తనలో నాయికా, నాయకుల మజ్జనానికి చెలికత్తెలు చేసే హడావుడి, క్రమా చూడొచ్చు.

**అప్పుడు మజ్జన మాడీ నంగనఁగూడి**
**కుప్పలుఁ దెప్పలుగా ఁగుమ్మరించరో** ॥పల్లవి॥

బంగారు 'కొప్పెరల' (1) పన్నీరు నించి
రంగైన పచ్చకప్పురపు ధూళొత్తి
చెంగటఁ గస్తూరి ధూళి చికిలి గావించి
పొంగారుఁ దట్టు పుణుఁగు పోయరో గిన్నెలను ॥అప్పు॥

పటికంపుఁ గాఁగుల పరిమళాలెల్లా
ఘటియించి కుంకుమతోఁ గడు మేదించి
అటు నిటు గొజ్జంగి నీరందంద నించి
కుటిల కుంతలలు పైఁగుమ్మరించరో ॥అప్పు॥

బలు పింగాణులఁ గదంబము గంధమును
కలపము గావించి గంబూరముతో
వెలయ మజ్జనమాడే వేంకటాద్రి విభుఁడు
చెలఁగి యింతులచేరి సేసచల్లరో ॥అప్పు॥ (12-255)

మజ్జన మవధరింతు మగువ విచ్చేయవో
గొజ్జంగి కస్తూరి నీటఁగుంకుమనీరు (12-272)

సంపంగి నూనియనే మజ్జనము సేయగ (12-368)

పై సంకీర్తనల్ని బాగా పరిశీలిస్తే ఆనాటి మజ్జన విధానం సులభంగా తెలుసుకోవచ్చు. ముందుగా బంగారు కొప్పెరలో పన్నీరు నింపుకొంటారు. ఆ తర్వాత స్నానంచేసే వాళ్ళకు పచ్చకర్పూరపు పొడిని, కస్తూరిని శరీరానికి బాగా పూసి, తట్టుపుణుగును గిన్నెలో పోసివుంచుతారు. పెద్దపెద్ద కడవల్లోని నీటికి పరిమళభరితమైన పటికాన్ని చేర్చి, కుంకుమతో మర్దించి, అటువైపు, ఇటువైపు గొజ్జంగిపూల నీళ్ళనుంచి ఆ నీటిని స్నానం చేసేవారి మీద పోసేవారు. గోరోజనాన్ని, గంధాన్ని బాగా కలిపి, కస్తూరిని చేర్చి స్నానం చేయించేవారు. కొంతమంది సంపెంగ నూనెను పట్టించుకొని స్నానం చేస్తే మరికొంతమంది గొజ్జంగి, కస్తూరి, కుంకుమ కలిపిన నీళ్ళతో స్నానం చేసేవారు.

**చీరలు :**

స్త్రీకి చీరేసింగారం. భారతీయ సంస్కృతిని ప్రతిబింబిస్తూ, స్త్రీల అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్న యీ చీర పాశ్చాత్య స్త్రీలను సైతం ఆకర్షించడంలో ఆశ్చర్యం లేదు. చీర కట్టుకొనే పద్ధతిని గురించి వొక పాశ్చాత్య స్త్రీ చేసిన వ్యాఖ్యను గమనించండి.

"A full sized Saree should be about five and half yards long and from thirty six to forty inches wide. To put it on, a woman marks a few pleats at one end in her hand, which she draws through in front of a band or string already around her waist. The length of the material is then carried round her figure towards the left and when it has been brought completely round, the end is taken over the should" (2)

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:2(5), February 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

రంగును బట్టి, అల్లిక (Design) ను బట్టి, వర్ణాన్ని బట్టి, సందర్భాన్ని బట్టి అన్నమయ్య కాలంనాటి స్త్రీలు ఎలాంటి చీరల్ని ధరించి వుంటారో కింద అనుశీలించడమైంది.

**ఎ) చీరలు – రంగులు :**

అన్నమయ్య తన సంకీర్తనల్లో ఏడు రంగుల చీరల్ని గురించి ప్రస్తావించాడు. అవి :

1. **పైఁడి చీర (26–140) :** బంగారురంగులో పచ్చగా మెరిసేదై ఉండొచ్చు.
2. **చంద్రగావి చీర (20–213) (22–320) :** కాషాయరంగులో ఉండొచ్చు.
3. **వలిపెపయ్యెద (24–581):** ఇది పలుచగా, తెల్లని రంగుదై ఉండొచ్చు.
4. **పలువన్నెల గంజినేత చీర (1–125) :** ఈ చీరలో ఎన్నో రంగులు ఉండివుంటాయి. ఇది నేత చీర. దానికి గంజిపెట్టబడింది. దీన్నిబట్టి ఆ కాలంలో కూడా స్త్రీలు గంజిపెట్టిన చీరల్ని ధరించినట్లు తెలుస్తోంది.
5. **చేల కొంగుటంచు (24–401) :** చేల కొంగు అంటే ఆకుపచ్చని రంగు కొంగు కలిగివుండొచ్చు.
6. **పసుపు శీర (12–370) :** పసుపురంగుదై ఉంటుంది.
7. **నీలిచీర (27–415) :** నీలంరంగు లేదా ఆకాశం రంగులో ఉండొచ్చు.

**బి) అల్లిక – అద్దకం :**

చీరకు కేవలం రంగువుంటే సరిపోదు. దానికి తగిన అల్లిక, అద్దకం వుంటేనే ఆ చీర అందం పెరుగుతుంది. ఈ అల్లికలు కూడా ఒక్కో ప్రాంతంలో ఒక్కోరకంగా ఉంటాయి.

"On the West Coast the Women, of caste generally wear white. While those of the lowest orders have small checks or stripes in various mixtures .......... Bandhana or Tie and die cloth in cotton as well as silk is much used in the central provinces and native places" (3)

అన్నమయ్య తన సంకీర్తనల్లో అల్లికను, అద్దకాన్ని బట్టి ఆరు రకాల చీరలు కనిపిస్తున్నాయి.

1. **పటవాలిచీరలు (1–125) :** ఈ చీరలో నిలువుగానో, అడ్డంగానో గీతలు వుంటాయి.
   తమిళంలో "పడై+వాళ్" = అంటే నాగేట్టికఱ్ఱ. నాగేటి కఱ్ఱతో దున్నినప్పుడు పొలంలో ఎలాంటి గీతలు పడతాయో అలాంటి గీతలుండేవే పటవాళి చీరలు (4)
2. **ముత్యాలకొంగు (12–74) :** చీరకొంగుకు ముత్యాలు కుట్టి వుండి వుంటాయి. ఈనాడు కూడా స్త్రీలు చీరలకు పూసలు కుట్టుకోవడం చూడొచ్చు.
3. **తళుకు బంగారంచుల దట్టిచీర (12–277) :** చీర అంచులకు బంగారు జరీ వుండి మెరుస్తూ వుండేదై ఉంటుంది.
4. **బొమ్మల పట్టుచీర (22–85) :** చీరల మీద రకరకాల బొమ్మలు ముద్రించి ఉండొచ్చు.
5. **బంగారు పువ్వుల పయ్యెద (28–212) :** పైటంతా బంగారు పువ్వులు ముద్రించబడివుండొచ్చు.
6. **బంగారు చెఱఁగుల పట్టు పుట్టములు (12–352) :** బంగారు రంగుతో వుండే కొంగు కలిగిన పట్టుచీరై ఉంటుంది.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:2(5), February 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

**సి) చీరలు – వర్గం :**

సాధారణంగా సామాన్య స్త్రీలు నారచీరల్ని ధరిస్తే, ధనవంతులైన స్త్రీలు చాలావరకు పట్టుచీరల్ని ధరించేవారు. అన్నమయ్య సంకీర్తనల్లో కూడా ఆయా వర్ణాల స్త్రీలు వారి తాహతుకు, అభిరుచికి తగ్గట్టు ధరించటం గమనించవచ్చు.

1. **అంచుల తొగరు చీర (12–103) :** గొల్లెతవర్ణనలో ఆమె ఈ చీర ధరించినట్టు వర్ణించబడింది. చాలావరకు ఇది నారచీరై వుంటుంది.
2. **నారపట్టు చీర (26–230):** దీన్ని ఒక చెంచెత ధరించినట్లు అన్నమయ్య వర్ణించాడు. ఇది పట్టుదారంతో కాకుండా, పచ్చనిరంగులో ఉండే నారతో నేయబడివుండొచ్చు.
3. **పట్టుచీర (13–225) :** సంపన్నులైన ఆడవాళ్ళు మోజుపడి తరచుగా ధరించే చీర.

**డి) చీరకట్టు – సమయ, సందర్భాలు :**

సమయం, సందర్భాన్నిబట్టి కూడా ధరించే దుస్తుల్లో భేదం వుంటుంది. పేరంటాలు, పెళ్ళిళ్ళు మొదలైన సందర్భాల్లో పట్టుచీరల్ని ధరిస్తారు. ఉత్తరాదిన పెళ్ళప్పుడు పెళ్ళికూతురికి ఎఱ్ఱని చీరని కట్టిస్తారు. ఇలా ఒక్కో సందర్భంలో, ఒక్కో సమయంలో చీరల్ని ధరించడం గమనించవచ్చు.

1. **నార పట్టుసీర (26–230) :** అరణ్యవాసం సందర్భంలో సీతారాముల ప్రసక్తిలో ఈ నారపట్టుచీర ప్రస్తావన కనిపిస్తోంది. సీతాదేవి అంతఃపురంలో పట్టుచీరలు కట్టినా, అరణ్యవాస సందర్భంలో నారచీరల్ని ధరించినట్టు తెలుస్తోంది.
2. **ధళధళమనే ముత్యాల చెఱంగుచీర (12–179) :** ఈ చీర ప్రస్తావన ఒక “అల్లోనేరేళ్ళు” గీతంలో వుంది. అల్లో నేరేళ్ళను అమ్మాయిలు వెన్నెల్లో ఆడుతూపాడతారు. ఆ సందర్భంలో వెన్నెలలో మెరిసేలా అమ్మాయిలు తమ చీరకొంగులకు తళతళలాడే ముత్యాల్ని కుట్టుకొని ఉండొచ్చు.
3. **మడుగు చీర (24–222) :** పండుగలు, నోములు, పూజలు చేసే సందర్భాల్లో తమనెవరూ తాకకుండా కట్టుకొనే చీర. అన్నమయ్య ఎందువల్లో రవికెల ప్రస్తావన చేయలేదు.

**మై పూతలు :**

అంతఃపురకాంతలు తమదేహానికి సుగంధద్రవ్యాల్ని పూసుకొనేవారు. అలాగే శరీరంలో వేడి తగ్గించుకోవటానికి గంధంలాంటి సుగంధద్రవ్యాల్ని వాడేవారు. అన్నమయ్యకాలంలో ఎలాంటి ద్రవ్యాన్ని, లేపనాన్ని వాడేవారో ఈ కీర్తనలద్వారా తెలుస్తోంది.

**పుప్పొడి (24–374), (24–487) :** పువ్వులో వుండే పొప్పుడిని ఆ కాలంలో మైపూతగా వాడేవారు.

**జవ్వాది (24–110), (24–147), (24–160) :** "An odurus secretion of a kind of cinet cat. ఇది ఒక గండుపిల్లి జాతి మృగము యొక్క మదము. చేదుగా, నుప్పగానుండును. సువాసన గలిగి మిక్కిలి మనోహరముగ నుండును” (5)

**కస్తూరి (24–63), (24–203), (24–354) :** "Muschus Moschiferus, Musk మృగనాభిరస మృగమదం. ఇది వెగటుగా, చేదుగా, కారముగనుండును. వేడిచేసిన ఆర్చును. సువాసనగలది. సహజమైన దేహపు కాకను బలపరుచును” (6)

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:2(5), February 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

**తట్టు పుణుంగు (12-37) :** "పిల్లి నుండి తీసిన ఒక సుగంధ ద్రవ్యం" (7)

**అన్నమయ్య సంకీర్తనల్లో కర్పూరం ప్రస్తావన :** కప్రపుభరణ (26-120), కప్పుర గంధులు / 12-352, కప్పురంపు టింటిలోన (12-172). **కర్పూరం :** "ఇది చేదుగ, వెగటుగ, సువాసనగ నుండును". (8)

**అన్నమాచార్య సంకీర్తనల్లో గంధం ప్రస్తావన :** శరీర కాంతిని పెంచుకోవటానికి, ఉష్ణం తగ్గించుకోవటానికి గంధాన్ని వాడేవారు. గంధపుముద్దలు (24-138), గంధపుపొడి (24-144), గంధము (24-85) (24-349).

**పన్నీరు :** సుగంధ ద్రవ్యాలు కలిపిన నీరు, పన్నీరు (24-87), (24-577), (24-155)

**మకరికాపత్రం (12-31), (3-31):** ఆనాటి స్త్రీలు తమ చెక్కిళ్ళమీద మకరికాపత్రరసాన్ని రకరకాల ఆకారాల్లో చిత్రించుకొనేవారు. చెంపల లప్పలు (12-5) కూడా ఇలాంటివే.

**లక్క / లత్తుక :** "లక్షా, కీటజ, రక్షమాతృక అనేవి పర్యాయపదాలు. లక్కపట్టిలోని ద్రవపదార్థమును లత్తుక అందురు. దీనితో రంగుల మిశ్రమముచేసి పాదాలకు, పెదవులకు, కండ్లకు అందముకొరకు రంగు వేసికొందురు" (9)

ఈ కాలంలో యువతులు తమ చేతులకు, కాళ్ళకు అందాన్ని ఇనుమడింపచేయటానికి గోళ్ళరంగుల్ని, గోరింటాకును పెట్టుకుంటున్నట్లు; ప్రాచీనకాలంలో స్త్రీలు లత్తుకరసాన్ని వాడేవారు. "ఆనాటి స్త్రీలు గోళ్ళకు గోరింటాకు దంచి కట్టి రంగును వేసికొనుచుండిరి. ............... చేతులకును, కాళ్ళకును లక్కరంగును పూసుకొనుచుండిరి. కాళ్ళకు పారాణి పెట్టుకొనుచుండిరి. " (10)

అన్నమయ్యకాలంలో పెదవుల వన్నెకోసం స్త్రీలు లత్తుకవాడినట్లు తెలుస్తోంది. ఉదా॥ లత్తుక మోవికి (3-360). చెక్కుల లక్కరసములు (27-403).

**బొట్లు :**

స్త్రీ నొసటికి కుంకుమ అందాన్నిస్తుంది. సౌభాగ్య చిహ్నాల్లో బొట్టు ముఖ్యమైనది. యువతులు తమ ముఖ సౌందర్యాన్ని పెంచుకోవటానికి రకరకాల బొట్లు ధరిస్తారు. ఆకారాన్ని బట్టి, రంగును బట్టి, వస్తువును బట్టి అన్నమయ్య కీర్తనల్లో ప్రస్తావించబడ్డ బొట్లు మూడు రకాలు.

**1. ఆకారాన్నిబట్టి : -** స్త్రీలు ధరించే బొట్లల్లో కూడా ఎన్నో ఆకారాలు వుంటాయి.

**ఎ) చంద్రవంక బొట్టు (24-82) :** చంద్రవంక (అర్ధచంద్రాకారం) ఆకారంలో వుండేబొట్టు.

**బి) చుక్కబొట్టు (24-55) :** చిన్నగా ఒక చుక్కలా ఉండేది.

**సి) చిన్ననామ మాయె (25-477) :** కాస్త పొడవుగా దోసగింజ ఆకారంలో వుండే బొట్టు.

**2. రంగునుబట్టి : -** బొట్లు, కుంకుమ ఎన్నో రంగుల్లో వుంటాయి. అన్నమయ్య కీర్తనల్లో కుంకుమ, కస్తూరి బొట్టుల ప్రస్తావన ఉంది.

**ఎ) కుంకుమ :** ఇది చాలావరకు ఎఱుపు రంగులో ఉంటుంది. **కావి కంటి కుంకుమ (28-53)** కాషాయరంగులో ఉంటుంది.

**బి) కస్తూరి బొట్టు (24-455) :** ఇది నలుపురంగులో వుంటుంది.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:2(5), February 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

**3. వస్తువునుబట్టి : -**

**ఎ) వజ్రాల బొట్టు (24-128) :** వజ్రాలను ఉంచి చేసిన బొట్టై ఉంటుంది. దీన్ని అంతఃపుర స్త్రీలు ధరించివుంటారు.

**బి) కాకి పైఁడిబొట్టు (25-418) :** కాకిబంగారంతో చేసిన బొట్టై ఉండొచ్చు. దీన్ని సామాన్యస్త్రీలు, చెంచెతల్లాంటి ఆటవికస్త్రీలు ధరించి ఉండవచ్చు.

**కాటుక :**

చందమామలాంటి మోముమీద అటూ ఇటూ చంచలంగా తిరిగే గండుమీనాల్లాంటి కళ్ళు మరీ పెద్దగా, అందంగా కనిపించాలంటే కాటుక అవసరమే మరి! అన్నమయ్య వర్ణించిన నాయికలు సైతం తమ విశాలనేత్రాలకు కాటుకను అలంకరించుకోవడం మరువలేదు.

**ఉదా :** కాటుక కన్నుల (25-366), కజ్జలం (22-82), కాటుక దీరుచుకొంటా (26-235)

**శిరోజాలంకరణ :**

"జుట్టున్నమ్మ ఏ కొప్పువేసినా అందమే" అన్న మాట అక్షరసత్యం. పొడవాటి వాల్జెడతో కన్నెలు వయ్యారంగా నడుస్తూ ఉంటే నాగుపాము నాట్యమాడుతున్నట్టే ఉంటుంది. స్త్రీలు తమ కురుల్ని చక్కగా చిక్కుతీసికొని, కొప్పునో, జడనో వేసికొని అందులో పూలు తురుముకొంటే ఆ అందం చెప్పనలవికాదు. అన్నమయ్య తన నాయికలకు చేసిన శిరోజాలంకరణను - చిక్కుతీసుకోవడం, పాపిడి తీయడం, సవరం, జడలు, కొప్పులు, పువ్వులు అనే అంశాలుగా వర్గీకరించి పరామర్శించడమైంది.

**ఎ) చిక్కుతీసుకోవడం : -** కొప్పువేసుకోవాలన్నా, జడవేయాలన్నా ముందు జుట్టు ఎలాంటి చిక్కులేకుండా అనుకూలంగా ఉండాలి. అన్నమయ్య నాయికలు కొనగోళ్ళ చిక్కుదీసి (24-34), 'చెదరిన నెరల చిక్కుదీసి (24-34) కొన్నారు.

**బి) పాపిడి తీయడం : -** పాపిడి, కేశవీధి (11). ఈ పాపటను కొంతమంది మధ్యగా తీసుకుంటే, మరికొంతమంది ప్రక్కగా తీసుకుంటారు. అన్నమయ్య సంకీర్తనల్లో పక్కనఁ బాపట దువ్వి (32-361) అనే చోట నాయిక పక్కపాపిడి తీసికొన్నట్లు కనిపిస్తోంది.

**సి) సవరం : -** జుట్టున్నమ్మ ఏ కొప్పువేసినా అందమే. మరి జుట్టులేనమ్మ సంగతేంటి? తక్కువజుట్టు వుండే స్త్రీలు తాము కూడ పొడవాటిజడనో, గంపంతకొప్పునో వేసుకోవాలని తహతహలాడ్డం మామూలే. అయితే అన్నమయ్య వర్ణించిన నాయిక ఒకతె ఎక్కువ జుట్టు ఉండికూడ తృప్తిపడక సవరం వేసుకుంటానంది. అందుకు చెలికత్తెలు సవరమేటికే? (12-2) అంటున్నారు.

జుట్టున్న ఆమె సవరానికి ఆశపడితే జుట్టు తక్కువగా ఉండే తొయ్యలులు సవరాన్ని ఆశ్రయించక తప్పదుగా! అన్నమయ్య తన సంకీర్తనల్లోని నాయికలకు సీదాసాదా సవరాల్ని ధరింపచేయటానికి ఇష్టపడలేదు. అందుకే వారిచే రకరకాల సవరాల్ని అలంకరింపజేశాడు.

**1. కుప్పెసవరము (24-280) (26-3): -** సవరంతోపాటు దాని చివర కుచ్చులు కూడా అమర్చివుంటారు.

**2. మణుల కట్టె సవరము (12-302): -** సవరంలో అక్కడక్కడా మణులు అమర్చి గట్టిగా నిటారుగా ఉండేదై ఉండొచ్చు.

**3. సన్నపు మణుల కుప్పె (12-277): -** సవరం చివర సన్నటి మణులు పొదిగిన కుచ్చులు కలిగివుండొచ్చు.

**డి) జడలు : -** నిడుపాటి నల్లని జుట్టుతో, పొడవాటి జడను అల్లుకొని ఇంతి వయ్యారంగా నడుస్తూవుంటే ఆ జడ వాక

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:2(5), February 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

నల్లనిత్రాచు పాకుతున్నట్లు కనిపించడంలో అతిశయోక్తిలేదు. సత్యభామ తన వాల్జెడతో కృష్ణున్ని కొట్టిందన్న భామాకలాపంలోని వర్ణన స్త్రీల కురుల అందాన్ని వర్ణించటానికి చిన్న ఉదాహరణ మాత్రమే. కాలానుగుణంగా నేటి సమాజంలో జుట్టును భుజాలవరకు కత్తిరించుకోవడం నవీననాగరికతకు చిహ్నమైనప్పటికీ నేటికీ పొడవైనజడతో ఒక అమ్మాయి నడిచివెళ్తే ఆమె జడమీద మన చూపు అతుక్కుపోవటం పరిపాటి.

అన్నమయ్యకాలంలో జడలకన్నా కొప్పులే ఎక్కువగా వేసుకొనేవారేమో! అందుకే కాబోలు ఆయన సంకీర్తనల్లో జడలప్రస్తావన కొప్పులంత ఎక్కువగా కనిపించడంలేదు. చివరికి పెళ్ళికూతురికి కూడ జడవేయించక కొప్పే వేయించాడు.

1. జడలు (12-218)
2. కరకజడ (11-2-38)
3. జడల సొల్లెము సుట్టి (1-230), (26-230)
4. నులిగురుల విరిజడలతో (12-218) అనే జడలు మాత్రం ప్రస్తావించబడ్డాయి.

**ఈ) కొప్పులు :**

జుట్టు మొత్తాన్ని ఒకచోట చేర్చి తలవెనుకభాగంలో ముడివేయడాన్ని కొప్పు లేదా తురుము అంటారు. అన్నమయ్య తన సంకీర్తనల్లో నాయికలను ఎన్నోరకాల కొప్పులతో సింగారించాడు.

**1. నేసకొప్పు (24-48) :** కొండెసిగ

**2. కీలుగొప్పు (12-162) :** జాఱుగా ముడిచిన వెంట్రుకల దూముడి. ఇలాంటిదే **కీలుగంటు (24-582)**

**3. నిక్కిన కొప్పు (24-56) :** ఎత్తుగా వేసుకొనేదై ఉంటుంది.

**4. బోలు కొప్పు (24-292) :** లోపల ఏమీలేకుండా ఖాళీగా వుండేట్లు వేసుకొనే కొప్పు.

**5. మూరెడంత కొప్పు (12-205) :** మూర యెంత పొడవుగా ఉంటుందో అంత పొడవుగా కొప్పువేసుకొనే వారేమో!

**6. నూఁగురుల కొప్పు (14-73) :** సన్నగా నువ్వుగింజల్లా అల్లివేసుకొనేవై ఉండొచ్చు.

**7. గంపలకొప్పు (12-5):** పెద్దగా, వెడల్పుగా ఉండేదై ఉండొచ్చు. ఇవేకాక **పౌజుల కొప్పు (24-582), నడుపు కొప్పు (15-114)** లాంటి ఇతర కొప్పుల ప్రస్తావన కూడ వుంది.

**ఎఫ్) పువ్వులు :**

రకరకాల కొప్పులు వేయగానే సరిపోదు. వాటిని తగిన భూషణాలతో, పువ్వులతో అలంకరిస్తేనే శిరోజాలంకరణ పూర్తవుతుంది. ఆ కొప్పులోకి పూలు చేరితేనే వాటి అందం రెట్టింపవుతుంది. అన్నమయ్య తన సంకీర్తనల్లోని నాయికల కొప్పులను మంకెన పూవు (12-95), పున్నాగలు (12-176), వాసంతికలు (12-176), సేమంతి (12-104), దిరిశెనపువ్వు (12-367), బొండుమల్లెలు (12-231), పొగడపువ్వు (12-367), కెందామర (12-176) మొదలైన విరులతో అలంకరించాడు.

**ముగింపు :**

వర్ణనలకు కావ్యాలలో ఉన్నంత అవకాశం సంకీర్తనల్లో వుండదు. కాని అన్నమయ్య సంకీర్తనలను పరిశీలిస్తే పరిమితమైన చరణాలలో అపరిమితమైన, అద్భుతమైన అంశాల వర్ణనలు దర్శనమిస్తాయి. అన్నమయ్యకీర్తనల్లోని అలంకరణసామాగ్రిని పరిశీలిస్తే అన్నమయ్య సమాజపరిశీలనాదృష్టి అవగతమౌతుంది.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:2(5), February 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

**పాదసూచికలు :**

1. వెడల్పు ముఖం గల పెద్దపాత్ర, శబ్దరత్నాకరము – బ. సీతారామాచార్యులు.
2, 3. Woman in India - Mary Frances Billington, Page - 181.
4. అన్నమాచార్య సంకీర్తనలు – అన్నమయ్య జయంతి ప్రత్యేక సంచిక, పుట – 72, వివరణ : శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ.
5, 6. వస్తుగుణ దీపిక – శ్రీ యర్రా సుబ్బారాయుడు, పుట – 293, 148.
7. శబ్ద రత్నాకరము – బి. సీతారామాచార్యులు
8, 9. వస్తుగుణ దీపిక – శ్రీ యర్రా సుబ్బారాయుడు, పుట – 137, 195
10. ఆంధ్రుల చరిత్ర సంస్కృతి – సురవరం ప్రతాపరెడ్డి, పుట – 219.
11. శబ్ద రత్నాకరము – బి. సీతారామాచార్యులు.

**ఆధార గ్రంథాలు:**

1. అన్నమాచార్యులవారి ఆధ్యాత్మ శృంగార సంకీర్తనలు (ప్రథమ, ద్వితీయ, తృతీయ సంపుటాలు) : స్వీయరచన. కళాప్రవీణ మంచాళ ధరావు; సంపాదకులు – వాడ్రేవు పురుషోత్తం తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ, 1980.
2. అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు : సంపుటం – 18, పరిష్కర్త, పి.టి. జగన్నాథరావు, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణలు, తిరుపతి, 1964.
3. అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు : సంపుటాలు – 24, 27, 28, 29 పరిష్కర్త : శ్రీరాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణలు, తిరుపతి, 1977, 1979, 1980, 1980.
4. అన్నమాచార్యుల సంకీర్తనలు : తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణలు, 29వ వర్ధంతి సందర్భంగా ప్రచురించబడింది. కూర్పు – కామిశెట్టి శ్రీనివాసులు, 1982.
5. అన్నమాచార్యుల సంకీర్తనలు : తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణలు, 30వ వర్ధంతి సందర్భంగా ముద్రింపబడింది. కూర్పు – కామిశెట్టి శ్రీనివాసులు, 1982.
6. అన్నమాచార్యుల సంకీర్తనలు – స్త్రీ సంబంధిత గేయాలు : ఎన్. సుగుణ, పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాదు – 500 029, అక్టోబరు 1986.
7. ఆంధ్రుల సాంఘిక చరిత్ర : శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, సాహిత్య వైజయంతి ప్రచురణలు, హైదరాబాదు, 1986.
8. వస్తుగుణదీపిక : శ్రీ యర్రా సుబ్బారాయుడు, ఏ.బి.ఎస్. పబ్లిషర్స్, రాజమండ్రి, 1984.
9. శబ్దరత్నాకరము : బహుజనపల్లి సీతారామాచార్యులు, ఏషియన్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్, నెం.5, శ్రీపురం ఫస్ట్ స్ట్రీట్, మద్రాసు – 4.
10. Woman in India - Mary Frances Billington Kiran Mudran Kendra, A-38/2, Mayapuri, Phase-1, New Delhi - 110064, Second Edition - 1987.